పింఛన్ల జాతర

● 308 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : నియోజకవర్గంలో పింఛన్ల జాతర కొనసాగుతోంది. ఈనెల 1వ తేదీ నుంచి రూరల్, పట్టణంలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వార్డుల్లో కౌన్సిలర్లు, గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తున్నారు. గురువారం రూరల్‌లో 35 గ్రామాలకు కొత్తగా మంజూరైన 308 పింఛన్‌లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా మంజూరైన 453 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. నేటితో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగిసింది.

పండగ వాతావరణంలో..

ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్వగృహం, పార్టీ కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. పింఛన్ల కోసం 35 గ్రామాలకు చెందిన లబ్ధిదారులు వారికి తోడుగా సహాయకులు, ప్రజలు, లబ్ధిదారులు తరలిరావడంతో జాతరను తలపించింది. పింఛన్లు అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సంతోషం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పింఛన్లు..

రాజకీయ పార్టీలు, కులమతాలకు తీతంగా అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నివాసం వద్ద 35 గ్రామాలకు చెందిన 308 మందికి పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. మునుపెన్నడూ లేనివిధంగా పింఛన్‌లు, రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, ఆదర్శపాలనలో జీవనం సాగించాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కుమ్మక్కయ్యి ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నాయని, వారి మాయమాటలను నమ్మవద్దన్నారు.

చాలా సంతోషంగా ఉంది



నా భర్త గుండె జబ్బుతో చనిపోయి ఆరు నెలలైంది. మాకు సెంటు భూమి కూడా లేదు. ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలీనాలీ చేసుకుని కుటుంబాన్ని పోషించాలి. మా అవస్థలు గుర్తించి వితంతవు పింఛన్ మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఇంత త్వరగా నాకు వితంతు పింఛన్ వస్తుందని అనుకోలేదు.

– పద్మ, దిబ్బనకల్

జగనన్నకు రుణపడి ఉన్నాం



గత ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్నా నాకు పింఛన్ రాలేదు. ఇప్పుడు కూడా పింఛన్ మంజూరు కాదనే అనుకున్నా. కానీ అన్ని పరిశీలించి వెంటనే పింఛన్‌ను మంజూరు చేయించారు. పింఛన్ రావడం సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– అల్లమ్మ, సాదాపురం

తలుపుతట్టిన పింఛన్ కానుక



పెద్దకడబూరులో కొత్త పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు : మండలంలో మరో 268 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్ కానుక తలుపు తట్టింది. కొత్తగా మంజూరైన పింఛన్లను మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ జనార్దన్ ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 268లో ఈ నెల మొదట్లో 235 రాగా మిగిలిన 33 పింఛన్‌లు గురువారం వచ్చాయి. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హులెవరూ పథకాలకు దూరంగా ఉండరాదని రెండో విడతలో మరింత మందిని లబ్ధిదారులుగా మార్చారని చెప్పారు. ఇప్పటికే మండలంలో 6,523 పింఛన్‌లు వస్తున్నాయన్నారు. ఇంకా అర్హులెవరికైనా అందకపోతే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం



ఉరుకుంద క్షేత్రంలో భక్తుల సందడి

కౌతాళం: తమ ఇలవేల్పు అయిన ఉరుకుంద ఈరన్న స్వామి వారిని గురువారం అమావాస్య సందర్భంగా దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రావణమాసం చివరి గురువారంతో పాటు అమావాస్య కలిసి రావడంతో బుధవారం సాయంత్రం నుంచే క్షేత్రానికి భక్తుల రాక మొదలైంది. దీంతో ఉదయం ఆ సంఖ్య మరింత పెరగడంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అధిక శాతం మంది భక్తులు క్షేత్ర పరిసరాల్లో పిండివంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కోసిగి సీఐ ఏరిషావలి ఆధ్వర్యంలో కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పోలీసు బందబస్తు ఏర్పాటు చేశారు.



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో..

ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం గురువారం రోజు అమావాస్యతో భక్తుల సందడిగా నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తుల్లో అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే.. తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఇదంతా బాబు స్వయంకృతాపరాధమే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్ : చంద్రబాబు నాయుడు స్వయం కృతాపరాధంతోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రిమాండ్‌కు వెళ్లాల్సి వచ్చిందని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. చంద్రబాబునాయుడిపై ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని టీడీపీ వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని ఖండించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, కక్ష్యపూరితంగానే అక్రమ అరెస్టు చేయించారని ప్రభుత్వంపై నిందలు వేయడం మంచి పద్ధతి కాదన్నారు. పద్ధతి ప్రకారంగా అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ తేల్చడంతోనే అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టుకు రిమాండ్‌కు ఆదేశించిందని, తప్పు లేకపోతే కోర్టు రిమాండ్‌కు ఎలా పంపుతుందని ప్రశ్నించారు. బాబు అరెస్టుకు నిరసన వ్యక్తం చేయడానికి నాయకులు, కార్యకర్తలను బతిమాలుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, జిల్లా కార్యదర్శి జిలేకాబీ ,నాయకులు ఉరుకుందు, నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, వై.పి.లక్ష్మణ్, ఆంధ్ర లక్ష్మన్న, కల్పవల్లి పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి గురువారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి వేకువజామున జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'గులాబీ' నివారణపై అవగాహన



పురుగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం : పత్తి పంటను ఆశిస్తున్న గులాబీ రంగు పురుగు నివారణపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని చిలకలడోణ గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం చేపట్టారు. జిల్లా పరిశోధన సంస్థ ఏడీఏ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పురుగు ఉధృతిని పరిశీలించారు. గులాబీ రంగు పురుగు నివారణ కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పొలాల్లో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకుంటే తల్లి పురుగులు నశించే అవకాశం ఉంటుందన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే క్వినాల్ పాస్, క్లోరోఫైరిపాస్ మందులను పిచికారీ చేయాలని చెప్పారు. పరిశోధన సంస్థ వ్యవసాయాధికారి శశిధర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి జీరా గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారి నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

నివాళి

ఆదోనిరూరల్ : సీపీఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ కొర్రపాటి టీచర్ రామయ్య రెండో వర్ధంతిని గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు మాట్లాడుతూ రామయ్య టీచర్ రామయ్యగా ప్రజల్లో మంచి గుర్తింపు పొంది మిల్లుల్లో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి వారి మేలు కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కౌతాళం: మండలంలోని బదినేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమవుతాయని పాఠశాల హెచ్‌ఎం హరినాథరావు, వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ పోటీలు ఉంటాయని చెప్పారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఆదోని రూరల్ : పోలీసులు విధి నిర్వహణలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. గురువారం పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతూ హెల్మెట్లు ధరించి బైకు నడుపుతున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి, సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వినాయక చవితి పండగ, నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్‌ఐ పీరయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మంత్రాలయం: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ గురువారం రాత్రి మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సర్కిల్ కార్యాలయం, సబ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, దిశ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన ఆరాధన ఉత్సవాల్లో పోలీసులు బాగా పని చేశాని త్వరలోనే పలువురికి అవార్డులు అందిస్తామన్నారు.వినాయకచవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్ రాజు, కిరణ్ ఉన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ అక్షరాలను గడ్డిలో పొందుపరిచిన దృశ్యం

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ హిందీ భాష ఔనత్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, క్రాఫ్ట్ వంటివి నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.అనంతరం విద్యార్థుల నృత్యాలు, నాట్య ప్రదర్శనలు అకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హిందీ భాషాకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో రెండవ అధికార భాష హిందీ అని గుంతకల్ ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఆదోని ఆర్ట్ అండ్ సైన్సు కళాశాలలో గురువారం హిందీ దివస్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ సురేష్, హిందీ విభాగధిపతి మధు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో గురువారం జెడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో ఘనంగా హిందీ దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. గతేడాది 10వ తరగతిలో హిందీలో 90కి పైగా ఉత్తమ మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు డి.నయినా కుమారి మెమొంటోలు అందజేశారు.

20 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ శివరాములు

ఆదోనిసెంట్రల్ : ఈనెల 20, 21వ తేదీల్లో బాలబాలికల అండర్-14,17 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని ఎంఈఓలు శివరాములు, శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఆదోని మండల, నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మల్లికార్జున, సిద్దిఖీతో కలిసి మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.నరసయ్య, మండల ఇన్‌చార్జి జి.రామన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ గడువు పొడిగింపు

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏఓ రవి గురువారం తెలిపారు. సంబంధిత రైతులు తమ పొలాలకు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డు తీసుకెళ్లి పొలాల్లో జియోట్యాగింగ్ చేయించాలన్నారు. అలాగే సమీప రైతు భరోసా కేంద్రాలలో ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

హాలహర్వి: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన సిద్ధాపురం, గూళ్యం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులు సాగుచేసిన పత్తి, వరి తదితర పంటలను పరిశీలించారు. మండలంలో దాదాపుగా 306 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం జరిగిందని, వీరందరికీ పంట రుణాలు మంజూరుచేయాలని స్థానిక బ్యాంకు మేనేజర్‌కు విన్నవించినట్లు చెప్పారు.


మట్టి విగ్రహాలను పూజిద్దాం



ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన మట్టి వినాయక విగ్రహాలు

ఆదోనిఅర్బన్ : మట్టి విగ్రహాలను పూజిద్దాం... కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆర్‌ఆర్‌జీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు తిమ్మన్నగౌడ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి విగ్రహాలు కావలసిన వారు తమ పేర్లను స్థానిక మరాఠా గేరిలో ఉన్న వీరశైవ కళ్యాణ మండపంలో ఈనెల 16వ తేదీన నమోదు చేసుకోవాలన్నారు. 17న సాయంత్రం ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. భారతీ తీర్థ ఉద్యానవనం తిరుమలనగర్ వారి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు హనుమంతరావు, కృష్ణమూర్తి, గోపాల్, శివరామిరెడ్డి తెలిపారు. 15వ తేదీన తిరుమలనగర్‌లోని శంకరమఠంలో టోకెన్లు పొందిన వారికి 16న ఉదయం ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామని చెప్పారు.


రాఘవుడి సన్నిధిలో..



శ్రీమఠంలో ప్రదిక్షణలు చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం , ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, టీటీడీ పాలన పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి గురువారం మంత్రాలయం విచ్చేశారు. మఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ వారికి ఆహ్వానం పలికారు. ముందుగా మంచాలమ్మకు పూజలు చేసుకుని హారతులు పట్టారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు శేషవస్త్రం, రాయరు జ్ఞాపిక, ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు ఉన్నారు. అలాగే..రాఘవేంద్ర స్వామిని కర్ణాటక మంత్రి శరణబసప్ప గురువారం దర్శించుకున్నారు. వీరు ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షతలిచ్చి ఆశీర్వాదించారు. అంతకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

లిఫ్ట్ ఇరిగేషన్ సంప్ స్టోరేజీ పనులు ప్రారంభం



భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ సంప్ స్టోరేజీ పనులకు శ్రీకారం చుట్టారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, గ్రామ రైతుల సమక్షంలో పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐరన్‌గల్లు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.18 కోట్లు కేటాయించిందన్నారు. తుంగభద్ర నది నుంచి 7.5 కి.మీ. పైప్ లైన్ పనులు పూర్తి కావచ్చాయన్నారు. ఈ పనులు పూర్తయితే దాదాపు 1500 ఎకరాలకు సాగునీరు అందుతాయని చెప్పారు. నియోజకవర్గంలో మంత్రాలయంలో 52-బసాపురం, ఖగ్గల్, ఐరన్‌గల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నాయకులు భీమసేనా,శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆదోనిరూరల్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సైకియాట్రిస్టు డాక్టర్ ఎస్.చైతన్యకుమార్ సూచించారు. గురువారం ఆదోని-ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు, మద్యం సేవించడం, జూదానికి బానిసలై చాలామంది విద్యార్థులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. పట్టుదల, శ్రమ, లక్ష్యం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని చెప్పారు. కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధనరెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

కౌతాళం: మండలానికి కొత్తగా మంజూరైన వైఎస్సాఆర్ ఆసరా పింఛన్లను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శనివారం పంపిణీ చేస్తారని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి రెండో విడతలో 282 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. వీరందరికి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేస్తారన్నారు. ఇప్పటి వరకు మండలానికి 8,333 పింఛన్లు వస్తుండగా ఈ నెల మొదటి విడతలో 262 మంజూరు కాగా వాటికి లబ్ధిదారులకు అందజేశామని, ప్రస్తుతం రెండో విడతలో మరో 282 పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. దీంతో మొత్తం 8,877 మంది పింఛన్ లబ్ధిదారులున్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేసిన మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్ : నియోజకవర్గంలో వివిధ జబ్బులతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న 13 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.20.25 లక్షల విలువ జేసే చెక్కులను ఎమ్మెల్యే కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్ : శ్రావణమాసం సందర్భంగా స్థానిక సదాశివపేటలో శ్రీ గురుదత్తాత్రేయ స్వామి శ్రావణమాసం ముగింపు సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక భజనలు చేపట్టారు. నిత్య పూజలతో పాటు అమావాస్య పూజలు జరిపించారు. ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విష్ణువర్ధన్‌తో ఉపాధ్యాయులు

కోసిగి: మండల కేంద్రంలోని మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థి విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి హైజంప్ పోటీల్లో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఈనెల 22న ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నాడని చెప్పారు.

ఇంటింటా హిందూ ధర్మ ప్రచారం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం 14వ విడత ఇంటింటి హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం మండల కన్వీనర్ భీమలింగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి ఇంటికీ హిందూ ధర్మ ప్రచారాన్ని తీసుకెళ్లాలని ఇస్వీ గ్రామ సమీపంలోని బాలకోల ఈశ్వర దేవాలయం వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రజలందరికీ తెలియజేయడానికి ఇంటింటి ధర్మ ప్రచారం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సత్సంగం ద్వారా హిందూ సమాజంలో ధార్మిక చైతన్యం కలుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీ వరకు మండంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం పూర్తి చేస్తామని చెప్పారు. ఆదోని సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ నాగరాజు, కార్యకర్తలు వీరేష్, వీరారెడ్డి పాల్గొన్నారు.

దర్గాలో అమావాస్య పూజలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

కౌతాళం: స్థానిక ఇందినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పాల్‌దినకరన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదా చారి గురువారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ రామలింగయ్య స్వామి, ఉప సర్పంచ్ సత్రి తిక్కయ్య, నాయకులు వడ్డే రామన్న, మాజీ సర్పంచ్ అవతారం ఉన్నారు.

కల్లుదేవకుంటలో నాభూమి-నాదేశం

మంత్రాలయం : మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి-నాదేశం కార్యక్రమం చేపట్టారు. గురువారం గ్రామంలోని వైపీఆర్ ఫాంహౌస్‌లో మట్టిని సేకరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ అవినీతికి పాల్పడటంతోనే చంద్రబాబు జైలుకు వెళ్లారన్నారు. అరెస్ట్ విషయంలో బీజేపీ పాత్ర ఉందనడం హాస్యాస్పదమన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పురుషోత్తం రెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.